క్లుప్తంగా

విద్యుత్ స్తంభాల ఏర్పాటు



స్తంభం ఏర్పాటు చేస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ శివారులో వ్యవసాయ భూముల్లో విద్యుత్ తీగలు చేతికి అందేలాగా ప్రమాదకరంగా మారడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై ఈనెల 27న యమపాశాలుగా విద్యుత్ తీగలు శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్ అధికారులు గురువారం స్తంభాలను, తీగలను చూసి ప్రమాదాలు జరగకుండా సరిచేశారు. దీంతో రైతులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థికసాయం

లక్ష్మణచాంద: మండల కేంద్రానికి చెందిన సంగెపు లక్ష్మన్న(60) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలిసి కాంగ్రెస్ మండల నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈసందర్భంగా వారికి ఈటెల శ్రీనివాస్ రూ.5వేలు అందించారు. ఆయన వెంట నాగేష్, రవి, అట్లా శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్, సామెల్, సుధీర్ తదితరులు ఉన్నారు.

బాబా ఆలయంలో సందడి



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కుంటాల: మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. ఉదయం బాబాకు మంగళస్నానం, అభిషేకం, అలంకరణ, గోపూజ కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్న హారతిలో భక్తులు బాబాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

విద్యుత్ తీగల కింద మొక్కలు నాటొద్దు

సోన్: హరితహారంలో భాగంగా పంచాయతీ అధికారులు మండలంలోని విద్యుత్ తీగల కింద మొక్కలు నాటొద్దని ఏఈ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈసందర్భంగా మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ తీగల కింద మొక్కలు నాటడం వలన వర్షాకాలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గుతుందని పేర్కొన్నారు. మొక్కలను విద్యుత్ లైన్ పక్కన నాటాలని సూచించారు.

తాగునీటి సమస్య పరిష్కరించిన చైర్మన్



మోటారు వద్ద నీటిని ప్రారంభిస్తున్న చైర్మన్

ఖానాపూర్: పట్టణంలోని రెండో వార్డు పరిధి శివాజీనగర్ కాలనీలో గురువారం బోరు మోటారుకు మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం మరమ్మతులు చేయించి తాగునీటి సమస్యను పరిష్కరించారు. కాలనీలో తాగునీటి సమస్యను కౌన్సిలర్ కారింగుల సంకీర్తన సుమన్, స్థానికులు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లడంతో సమస్యను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పిసుపాటి పాపారావు, శేషాద్రి, రమేశ్, శ్రీహరి, శంకర్ తదితరులు ఉన్నారు.

విద్యాసంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ

ముధోల్: మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో గురువారం నూతన విద్యాసంవత్సర అకాడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేశారు. పాఠశాల సమితి కార్యదర్శి కంది మానాజీ, సహకార్యదర్శి ధర్మపురి, సుదర్శన్, నవీన్, ప్రధానాచార్యులు సారథి రాజు, ఆచార్యులు నాగేందర్ ఉన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ.. ఒకరికి గాయాలు

నర్సాపూర్ (జి): మండలకేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గురువారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. భైంసా పట్టణానికి చెందిన యువకులు ద్విచక్ర వాహనంపై నిర్మల్ వెళ్తుండగా నర్సాపూర్ (జి) బస్టాండ్ వద్ద ఇదే మండలంలోని చాక్‌పల్లి గ్రామానికి చెందిన ఫయాజ్ అనే యువకుడి ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నారు. దీంతో ఫయాజ్ కాలు విరిగింది. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి క్షతగాత్రుడ్ని నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

సృజనాత్మకం..వేసవి శిక్షణ

- పెంచికల్‌పాడ్ పాఠశాలలో శిబిరం
- ఆటపాటలతో కూడిన విద్య
- ఆసక్తి కనబరుస్తున్న విద్యార్థులు



తబలా నేర్చుకుంటున్న విద్యార్థులు



విద్యార్థులకు చతుర్విధ ప్రక్రియలు నేర్పిస్తున్న హెచ్‌ఎం ఎల్లన్న

కుంటాల: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు, వచ్చే విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది. ప్రాథమిక పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో రూమ్ టు రీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రభుత్వ సహకారంతో వేసవి సెలవుల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే ముధోల్ నియోజకవర్గంలో కుంటాల మండలం పెంచికల్‌పాడ్ ప్రాథమిక పాఠశాలలో బోధనకు శ్రీకారం చుట్టారు. విజ్ఞానం, వినోదం ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ప్రత్యేక గ్రంథాలయం ఏర్పాటు చేశారు.

ప్రత్యేక బోధన..

కుంటాల మండలంలోని పెంచికల్‌పాడ్ ప్రాథమిక పాఠశాలలో 82 మంది విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. మే 1 నుంచి ఉదయం 7 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు సహపాఠ్య కార్యక్రమాలు చేపట్టడం ప్రత్యేక బోధనకు నిదర్శనంగా నిలిచింది. విద్యార్థులకు సంగీతం నేర్పడం, గణితంలో చతుర్విధ ప్రక్రియలపై పట్టు సాధించేలా చూడటం, పుస్తకపఠనంపై ఆసక్తి కల్పించడం, కథలు చెప్పిస్తుండటం వంటి కార్యక్రమాలతో విద్యార్థులు ఆకర్షితులవుతున్నారు. విద్యార్థుల్లో నైతిక విలువలను పెంచేందుకు రోజుకో కథను వినిపించి వారు చెప్పేలా ప్రోత్సహిస్తున్నారు. తద్వారా విద్యార్థుల్లో ఊహాశక్తి, మంచి, చెడుల మధ్య విచక్షణ తెలుస్తుంది.

టోల్ ఫ్రీ నెంబర్..

విద్యార్థుల దగ్గర కథల పుస్తకాలు అందుబాటులో లేనప్పుడు రూమ్ టు రీడ్ ఆధ్వర్యంలో 040-452-09722 టోల్ ఫ్రీ నంబర్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ప్రతి విద్యార్థి టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి కథలు వినే అవకాశం కల్పించారు. సహపాఠ్య కార్యక్రమాలతో పాఠశాలకు వచ్చేందుకు విద్యార్థులు మరింత ఆసక్తి చూపుతారు.

ప్రావీణ్యం పొందిన విద్యార్థులు..

మండలంలోని పెంచికల్‌పాడ్ పాఠశాలలో వేసవిలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. నైతికలు విలువలు పెంపొందించేందుకు కథలు, గణితంలో చతుర్విధ ప్రక్రియలపై అవగాహన కల్పించారు. పరిసరాల పట్ల స్పందించేందుకు సహా కార్యక్రమాల ద్వారా ఆకర్షితులను చేయడం, ఆటపాటలతో కూడిన విద్య, సంగీతంపై పాఠశాలలోని 82 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఇందులో గణితంలో 26 మంది విద్యార్థులు, కథల్లో 50 మంది విద్యార్థులు, సంగీతంలో 20 మంది విద్యార్థులు, వక్తలుగా 20 మంది విద్యార్థులు, తబలా వాయించడంలో ఇద్దరు శిక్షణ పొంది ప్రావీణ్యం సాధించారు.

సరదాగా ఉంది



ఉదయం పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఆటపాటలతో కూడిన విద్య అందించడం సరదాగా ఉంది. సెలవుల్లో స్నేహితులను కలుసుకోవడం, వారితో పలు పాఠ్యాంశాలను నేర్చుకోవడం ఆనందాన్నిచ్చింది. దీంతో మాకు జ్ఞానం పెరుగుతుంది.

– గురజాల రూహిక, విద్యార్థిని

ప్రతిభను గుర్తించేందుకు



ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు కృషి చేస్తున్నాం. ప్రత్యేక బోధనతో విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించడం సాధ్యమవుతుంది. ఇంటి వద్ద నుంచే విద్యార్థులు కథలు వినేందుకు టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశాం.

– అడ్డిగ రాము, రూమ్ టు రీడ్, స్వచ్ఛంద సంస్థ ఏరియా కోఆర్డినేటర్

విద్యార్థుల్లో పరిజ్ఞానం పెరిగింది



విద్యార్థులకు వేసవి సెలవుల్లో ఆటపాటలతో కూడిన విద్యను అందించడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చు. పాఠ్యాంశాలు బోధించి వారితో చెప్పించడం ద్వారా విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానం పెరిగింది.

– ఎల్లన్న,హెచ్‌ఎం, పెంచికల్‌పాడ్

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

- న్యూవెల్మల్‌లో ముస్తాబైన శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం
- మూడు రోజుల పాటు వేడుకలు



ముస్తాబైన స్వామివారి ఆలయం

సోన్: మండలంలోని న్యూవెల్మల్‌లో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. శుక్రవారం నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు న్యూవెల్మల్ వీడీసీ చైర్మన్ రోడ్డ రాజేశ్వర్, కోశాధికారి గజ్జల గంగాధర్ తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రవారం ఉదయం అభిషేకం, అర్చన, శుద్ధి, పుణ్యాహవచనం, రక్షాబంధనం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పూజారి రామకృష్ణ పంతులు తెలిపారు. రెండోరోజైన శనివారం నిత్యార్చన, స్థాపిత దేవతారాధన, ఉత్సవమూర్తులకు స్థాపన, తిరుమంజనము, ఉపనిషత్ పారాయణం, లక్ష్మీనారాయణ యాగం, కుంకుమార్చనలు జరుగును. చివరిరోజైన ఆదివారం నిత్యనిధి ఆరాధన, కర్మణ, పుణ్యహవచనం, శేషహోమం, ఆలయ బలిహరణం, క్షేత్రపాలకబలి, పూర్ణాహూతి, స్వామివారి కల్యాణం, అనంతరం మహాఅన్నదానం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల భక్తులు తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని వీడీసీ సభ్యులు తెలిపారు.

ముగిసిన హరినామ సప్తాహం



హాజరైన భక్తులు



ఉట్టి కొడుతున్న మహరాజ్

భైంసారూరల్: మండలంలోని కుంసర గ్రామ హనుమాన్ ఆలయంలో వారం రోజులుగా కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహం గురువారం ముగిసింది. ఈసందర్భంగా పలువురు మహరాజ్‌లు ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని సూచించారు. భక్తులు తులసీమాలలు ధరించాలన్నారు. నిత్యం ధ్యానం చేస్తూ ప్రశాంతంగా జీవనం సాగించాలని పేర్కొన్నారు. అనంతరం ఆలయంలో ఉట్టికొట్టి భక్తులకు ప్రసాదం అందజేశారు. సప్తాహంలో పాల్గొన్న మహరాజ్‌లను ఆలయ, గ్రామకమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

వర్షాకాలంలో సమస్యలు తలెత్తకుండా చూడాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన ఎస్పీ

నిర్మల్‌చైన్‌గేట్: రానున్న వర్షాకాలంలో భారీ వర్షాలు, వరదలతో లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వర్షాకాలంలో భారీ వర్షాలు, వరదలతో ఎదురయ్యే సమస్యలు, తీసుకోవాల్సిన చర్యలపై ఆయన సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో రోడ్లపై వర్షపు నీరు నిల్వకుండా డ్రైనేజీల్లో చెత్త, పూడిక తొలగించాలని సూచించారు. నాలాలపై ఆక్రమణలు తొలగించాలని తెలిపారు. నదీ పరీవాహక లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి, పురాతన భవనాలు కూల్చివేయాలన్నారు. దోమలు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం చేపట్టాలన్నారు. నదులు, వాగులలో నీటి ప్రవాహం అధికంగా ఉండే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. విపత్తు నిర్వహణ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి పర్యవేక్షించాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య శాఖ అధికారులు జాగ్రత్త వహించాలన్నారు. తాగునీటిని క్లోరినేషన్ చేయాలని, గ్రామీణ ప్రాంత ప్రజలు వర్షాకాలం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని ఆదేశించారు. సమావేశంలో డీఎస్పీ గంగారెడ్డి, నిర్మల్ మున్సిపల్ కమిషనర్ రాజు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, వైద్యాధికారి ధనరాజ్, అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని ఆసుపత్రులపై చర్యలు

నిర్మల్‌చైన్‌గేట్: క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్‌ను జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని, రిజిస్ట్రేషన్ చేసుకోకుండా నిర్వహిస్తున్న ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్-2010 నిబంధనలపై జిల్లాస్థాయి రిజిస్ట్రేషన్ అథారిటీ కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తగిన అర్హతలు లేకుండా వైద్యం చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. అనంతరం వైద్యశాఖ తీసుకుంటున్న చర్యలు, వివిధ అంశాలపై చర్చించారు. సమావేశంలో ఎస్పీ జానకీ షర్మిల, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ధనరాజ్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ మురళీధర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్, విస్తరణ, మీడియా అధికారి రవీందర్ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆర్‌ఎస్‌ఎస్ ప్రారంభిక్‌వర్గ

ఖానాపూర్: ఆర్‌ఎస్‌ఎస్ శాఖ పని విస్తరణ కోసం సంఘం ప్రతీ ఏడాది శిక్షా వర్గాలు నిర్వహిస్తుందని.. అందులో భాగంగా వచ్చే నెల ఒకటో తేదీ నుంచి మూడో తేదీ వరకు ఖానాపూర్‌లో ప్రారంభిక్ వర్గ కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు పడాల ప్రభాకర్, సాంకేత్ వర్ధన్ తెలిపారు. గురువారం ఈ విషయమై పట్టణంలో మాట్లాడారు. ఈ ప్రారంభిక్ వర్గ కార్యక్రమంలో కొత్త వాళ్లకు శాఖ ప్రశిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో జరిగే ఈ కార్యక్రమానికి హాజరయ్యే వారు ఈనెల 31లోగా వర్గ స్థలానికి చేరుకోవాలని కోరారు. 8వ తరగతి, ఆపై చదువులు చదివినవారు మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 94934 74621, 90528 18744 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

వృథాగా మిషన్ భగీరథ జలం



లీకేజీతో వృథాగా పోతున్న నీరు

తానూరు: భైంసా నుంచి తానూరుకు సరఫరా చేసే భగీరథ ప్రధాన పైప్‌లైన్‌కు గురువారం హిప్నెల్లి శివారులో లీకేజీ ఏర్పడటంతో నీరు వృథాగా పోతోంది. దీంతో తానూరుతో పాటు 10 గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. అధికారుల నిర్లక్ష్యంతో తరచుగా ప్రధాన పైప్‌లైన్‌కు లీకేజీలు ఏర్పడుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. సమస్య పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు
- గ్రామాల్లో పర్యటించి ప్రజాసమస్యలు తెలుసుకున్న వైనం



రేవోజీపేటలో ప్రజాసమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

దస్తురాబాద్: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని మల్లాపూర్, బుట్టాపూర్, చెన్నూర్, గొడిసీర్యాల, మున్యాల, గొడిసీర్యాల గోండుగూడ, మున్యాలతండా, ఎర్రగుంట, భూత్కూర్ గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో డ్రెయినేజీ, తాగునీరు, పింఛన్ సమస్యలపై ఫిర్యాదులు చేశారని.. సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.

హనుమాన్ ఆలయంలో పూజలు..

అంతకుముందు బుట్టాపూర్ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సింగరి కిషన్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దుర్గం మల్లేశ్, యువజన సంఘం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నరేశ్‌రెడ్డి, రమేశ్‌రావ్, శరత్‌రెడ్డి, చుంచు వెంకన్న, రాజేశం, నాగరాజు, శ్రీనివాస్, మాన్కు, కిరణ్, రమేశ్, గోపి కార్యకర్తలు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. కంపుకొడుతున్న డ్రెయినేజీ



నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని ప్రధాన డ్రెయినేజీ చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి కంపు కొడుతుంది. మురుగునీరు నిలిచి ఉండటంతో దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి డ్రెయినేజీలో చెత్తా చెదారం, పూడికతీత పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: శ్రీనివాస్‌గౌడ్, ఎంపీవో, ప్రత్యేకాధికారి, ఫోన్ :94403 11142

నేడు బడిబాటపై సమావేశం

సోన్: కలెక్టర్ ఆదేశాల ప్రకారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం బడిబాట కార్యక్రమంపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సురేశ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి ఎంఈవో, మండలంలోని పంచాయతీ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్‌పర్సన్లు, ఐకేపీ ఏపీఎం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, పంచాయతీ కార్యదర్శులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

లోకేశ్వరం: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు బడిబాట కార్యక్రమంపై సమావేశం ఏర్పాటు చేసినట్లు మండల విద్యాధికారి చంద్రకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానోపాధ్యాయులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

అభివృద్ధికి సహకరించాలి



వ్యాపారికి ధ్రువీకరణ పత్రం ఇస్తున్న అధికారులు

కుంటాల: పంచాయతీల అభివృద్ధికి వ్యాపారులు సహకరించాలని ఎంపీడీవో ఎం.ఏ.రహీం పేర్కొన్నారు. గురువారం కుంటాలలో వ్యాపారుల ట్రేడింగ్ లైసెన్సులను రెన్యువల్ చేయించి అవగాహన కల్పించారు. వ్యాపారులు విధిగా దుకాణాల లైసెన్సులను పొందాలని సూచించారు. పంచాయతీలకు సకాలంలో పన్నులు చెల్లించాలని కోరారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి రాజబాపు తదితరులు ఉన్నారు.

రక్తదానం

నిర్మల్‌టౌన్: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని తెలంగాణ ఏక్తా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు షేక్ ముజాహిద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యాస్మిన్‌కు ఏ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో సొసైటీ పట్టణ అధ్యక్షుడు ముసేబ్ రక్తదానం చేశాడు. ఉపాధ్యక్షుడు సాజిద్, అల్మాస్, జుబేర్ పాల్గొన్నారు.

మిత్రుని కుటుంబానికి అండ



సాయం అందిస్తున్న మిత్రులు

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్‌లో తలారి శ్రీనివాస్ ఇటీవల కుటుంబసభ్యులతో కలిసి ఉపాధిహామీ పనులకు వెళ్లగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు కాలిపోయిందింది. దీంతో వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శ్రీనివాస్‌తో కలిసి 2000-01లో పదో తరగతి చదివిన మిత్రులు తమ వంతుగా రూ.30 వేలను జమ చేశారు. గురువారం శ్రీనివాస్ కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు. కార్యక్రమంలో మిత్రులు సాగర్, మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.